# కవుల పండుగ

ఇవేళ ఉగాది కదా, కవులపండగ ఏమిటని కొందరనుకోవచ్చు. అలా అనుకోవడంలో తప్పులేదు కూడా.

అయితే, ఉగాది కవుల పండగ అనడంలో కూడా తప్పులేదు.

మీరిప్పటికే ఉగాది ప్రత్యేక సంచికలు చూసేవుంటారు.



"ఉగాదీ, అప్పుడే వచ్చేశావా/ ఏదీ మాకేం తెచ్చావు చెప్పు? తళతళలాడే నక్షత్రాలు అడిగానా/ మిలమిలలాడే చందమామనడిగానా/ ఎందుకు ఉగాదీ, నాపై చిన్న చూపు? పట్టెడన్నం పెట్టి కరుణచూపు' వంటి కవితలు మీరు చదివే వుంటారు. కనీసం చూసైనా ఉంటారు. విన్నైనా ఉంటారు. ఒక కవి కుమారుడు అలా దెప్పుతూ, తనకు కావల్సిందేదో అడిగితే."

మరోకవి పుంగవుడు,

"ఏం ముఖం పెట్టుకని వచ్చావ్ ఉగాదీ/ అప్పులు చేసి పచ్చడి చేయించాను/ ఇప్పుడే రుచి చూశా ఉగాదీ / తీపి చేదులతో పాటు / మరో రుచి ఉప్పు! ఇదేమిటని అడిగానా ఆవిణ్ని / మిమ్మల్ని కట్టుకున్నాకా / నాకు మిగిలినవి కన్నీళ్లేకదా అవి', "కాసిన్ని పడ్డాయి లెండి /పచ్చడిలో" అంది సతీమణి/ అందుకే ఉగాదీ,/నీకు నాఇంట్లో లేదు, స్వాగతం, పోపో" అని కోప్పడతాడు.

ఇలాగే కొందరు పద్యకవులు ఉగాదిని ప్రశంసిస్తూనో విమర్శిస్తూనో మనకు అర్థంకాని గ్రాంధికంలో రాస్తారు. నూటికి తొంభై మందికి పైగా వాటిని చదవరు కనుక ప్రమాదమేమీ లేదు.

ఇవన్నీ పత్రికలూ టీవీల వ్యవహారం. పండగొచ్చేటప్పటికి కవితలు రాసే వాళ్లను రాంభట్ల గారో, మల్లారెడ్డి గారో తద్దినం కవులు అనే పేరు పెట్టారు. అది సరే.

ఉగాదినాడు కవి సమ్మేళనాలు ఉంటాయి. నలుగురు కవులు కలసినవేళ...... కవిత్వం పొంగి పొర్లడం మామూలే. నలుగురు కవులూ కలిసి తమ వూళ్లో కవి సమ్మేళనం నిర్వహిస్తారు. తమ మిత్రుల్నీ, తెలిసిన వాళ్లనూ ఆహ్వానిస్తారు. సభ మొదలయ్యాక "డబుల్స్"తో శ్రోతల చెవుల్లోని తుప్పును వదలగొడతారు.

డబుల్స్ అంటే, కవి తను రాసిన వాక్యాల్లో బావున్నాయనుకున్నవి రెండుసార్లు చదువుతాడన్నమాట. నిజానికి అలా చదవడానికిత "డబుల్స్" అనే పేరు లేదు. ఆ పేరును ఓ కవి మిత్రుడు ఖాయం చేశాడు. మొహమాటంతో శ్రోతలు కొసవరకూ ఉండొచ్చు. అదిలేని వాళ్లు మధ్యలోనో, ఇంకా ముందో వెళ్లిపోతారు.

ఆ మధ్య రాజమండ్రిలో జరిగిన శతాధిక కవి సమ్మేళనం లాంటిదయితే శ్రోతలకు కరువుండదు. ఎందుకంటే, ప్రతి కవికీ ఇతర కవులే శ్రోతలుగా వుంటారు.

ఇవి కాకుండా ఆకాశవాణి వారూ, దూరదర్శిని వారూ కూడా కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. ఈ సమ్మేళనాల్లో ఒకరిద్దరో, ఇద్దరుముగ్గురో ప్రసిద్ధకవులూ ఊరు పేరూ తెలియని మిగతా కవులూ పాల్గొంటుంటారు. ఆ ఊరు పేరు తెలియని కవులు కవిత్వం కానిదాన్ని శ్రోతలముందు పేల్చే అవకాశం కోసం ఏవేవో పైరవీలు చేస్తుంటారని తమకు పిలుపురాని కవులు అంటుంటారు.

అకాశవాణి, దూరదర్శినిల కార్యక్రమాలు చూసే వాళ్లు కూడా ఆ మాట నమ్ముతారు.

ఈ సమ్మేళనాల్లో కూడా డబుల్స్ దెబ్బలు తప్పవు. టీవీ రేడియోల్లో కవి సమ్మేళనాల కోసం కవిత్వంతో కుస్తీపట్టే ఒకరిద్దరు కథా రచయితలు లేకపోలేదు.

ఈ కవి సమ్మేళనాల్లో అంతా చేదేనా, తీపి ఉండదా అని ఎవరికైనా అనుమానం రావచ్చు. తీపికూడా ఉంటుంది. అయితే, కాస్త తీపికోసం బోలెడు చేదు దిగమింగక తప్పదు.

ఓ ఆకాశవాణి కవి సమ్మేళనంలో ఆరుద్ర కవిత విన్నాను, రెండు దశాబ్దాల క్రితం.

గాంధీ పుట్టిన దేశమా ఇది/ టార్చి లైటు పట్రండి వెతుకుదాం/ నెహ్రూ చెక్కిన శిల్పమా ఇది / తుమ్మజిగురు పట్రండి అతుకుదాం/ అంటూ చక్కగా సాగుతుంది ఆయన కవిత. ఆ కవితనే ఆ తర్వాత "గాంధీ పుట్టిన దేశమా ఇది" అంటూ ఆరుద్ర ఓ సినిమాలో పాటగా రాశాడు.

ప్రసిద్ధ భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి 'నాకు ఉగాదులు లేవు/ నాకు ఉషస్సులు లేవు' / అని ఓ సందర్భంలో బాధపడ్డాడు. వెలుతురు పిట్టల కవి కొత్తపల్లి సత్య.శ్రీ మన్నారాయణ 'ఉగాది ముందు' అనే కవితలో 'సాయంకాలాంతంలో మసక చీకట్లో / జంతు నేత్రంలా మెరిసే / రేడియం గడియారం నుంచి / నా చేయి విడిపించుకునే సరికి / వెలుతురు తెరలు / చరచరా తొలగిపోయి / వజ్ర బీజాలతో / ఆకాశం మేల్కొంటుంది' అన్నాడు.

మళ్లీ టీవీ, రేడియో కవి సమ్మేళనాల విషయంలో కొస్తే శ్రీశ్రీ, సినారె, అద్భుతదీపక్, గోపి వంటి కవులు చమక్‌లు మెరిపించిన సందర్భాలున్నాయి. శ్రోతలు అలరించిన చరణాలున్నాయి.

అయితే అలాంటి కొందరు కవులు తప్పిస్తే అత్యధిక కవులు కవిత్వం తప్పించి ఇంకేదో శ్రోతల మీదకు విసిరే అలాపనలు ఎక్కువ.

మరి, మనకివేళ ఉగాది పండగ. కవుల పండగ. కొద్దిపాటి తీపికోసం పెద్దపాటి చేదు మింగడానికి మీరు సహసించదలిస్తే మీ టీవీనో, రేడియోనో పెట్టుకోవచ్చు.

నేను మాత్రం ఫ్రెండ్స్‌తో సరదాగా గడపడానికి ఊళ్లోకి పారిపోతున్నా.

11.4.94

ఆంధ్రభూమి దినపత్రిక